సాక్షి ఒడిశా

సోమవారం । 30 । సెప్టెంబర్ । 2024



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు : రూ. 8.31.730
బంగారం : 9 గ్రాముల 350 మిల్లీ గ్రాములు :
వెండి : 257 గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



డిజిటలైజేషన్ అద్భుతం

సంతాలీ భాషను డిజిటలైజేషన్ చేసిన మయూర్ భంజ్ యువకుడు రాజ్‌జీత్‌ను ప్రధాని మోదీ ప్రత్యేకంగా అభినందించారు.

-8లో

దసరాకు ముసురు

భువనేశ్వర్: రాష్ట్రంలో దసరా వేడుకల సమయంలో వర్షాలు పడే అవకాశముందని స్థానిక వాతావరణ కేంద్రం వెల్లడించింది. పశ్చిమ, మధ్య బంగాళాఖాతం, పరిసర ప్రాంతాల్లో అల్ప పీడనం నేపథ్యంలో అక్టోబరు 6 నుంచి 10 మధ్య పలు ప్రాంతాల్లో ఉరుములతో కూడిన తేలికపాటి జల్లులు పడే అవకాశం ఉందని పేర్కొంది.

న్యూస్‌రీల్

మహిళలకు దసరా కానుక

- అక్టోబర్ 9న మలి విడత సుభద్ర పథకం వర్తింపు

భువనేశ్వర్: రాష్ట్రంలో బీజేపీ సర్కారు ఎన్నికల హామీల కార్యాచరణలో భాగంగా సుభద్ర పథకం ప్రవేశ పెట్టింది. ఈ నెలలో భారత ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం పురస్కరించుకుని తొలి విడత మొత్తం అర్హులైన మహిళల బ్యాంకు పొదుపు ఖాతాలకు ప్రత్యక్షంగా బదిలీ చేశారు. మంజూరు ప్రక్రియలో భాగంగా మిగిలిన అర్హులైన మహిళా లబ్ధిదారులకు సుభద్ర యోజన నిధులను అక్టోబర్ 9న దసరా కానుకగా బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, మహిళ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ప్రభాతి పరిడా ఆదివారం ప్రకటించారు. రాష్ట్రంలో సుమారు 40 లక్షల మంది మహిళలు లబ్ధి పొందనున్నారని చెప్పారు. తొలి విడతలో 25 లక్షల మంది మహిళలు లబ్ధిని పొందారని వివరించారు.

దివ్యాంగులకు చేయూతనిద్దాం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

జయపురం: దివ్యాంగులకు చేయూతనివ్వాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని అదనపు బీఈఓ సుభాష్‌చంద్ర మాఝి అన్నారు. జయపురం సబ్‌డివిజన్ బొరిగుమ్మ సమితి బ్లాక్ ఎడ్యుకేషనల్ అధికారి కార్యాలయంలోని దివ్యాంగ సాధన కేంద్రం ఆదివారం దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాలు అందించేందుకు ప్రత్యేక గుర్తింపు శిబిరం ఇనర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు అవసరమైన పరికరాలు సమకూర్చితే సమాజంలో మరింత స్వతంత్రంగా జీవించగలరని చెప్పారు. అనంతరం డాక్టర్ తృప్తి రంజన్ స్వైన్, డాక్టర్ అరుణకుమార్ యాదవ్, డాక్టర్ సిద్ధార్థ పాత్రోలు దివ్యాంగులకు వైద్యపరీక్షలు నిర్వహించి పరికరాల కోసం ఎంపిక చేశారు. కార్యక్రమంలో జగదీష్ బెహరా, నళినీ బొడనాయిక్, ఉపాధ్యాయులు మిలన్ కుమార్ దాస్, పవిత్ర భోయ్, సనత్ కుమార్ సాహు, సాగరిక బణువ, ఎ.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పడవ నుంచి జారిపడి మహిళ మృతి



మృతదేహాన్ని బయటకుతీస్తున్న అగ్నిమాపక సిబ్బంది

జయపురం: జోలాపుట్ జలాశయంలో నాటు పడవ నుంచి జారిపడి మహిళ మృతిచెందింది. పాడువ పోలీసుస్టేషన్ పరిధిలోని కులార్ సింగ్ పంచాయతీ బడేల్ గ్రామానికి చెందిన లక్ష్మణ కిరిసాని భార్య సుభద్ర కిరిసాని(45) దంపతులు శనివారం పాడువ వెళ్లారు. పనులు ముగించుకుని నాటు పడవలో తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. జలాశయం మధ్యకు వచ్చేసరికి సుభద్ర ప్రమాదవశాత్తు జారిపడింది. ఆమెను రక్షించే అవకాశ లేక లక్ష్మణ కిరిసాని గ్రామానికి వచ్చి గ్రామస్తులకు విషయం చెప్పాడు. అనంతరం పాడువ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు నందపూర్ అగ్నిమాపక సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని జలాశయంలో గాలించి మహిళ మృతదేహాన్ని బయటకు తీశారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఏఎస్ఐ హిమాంశు బెనియా ఆదివారం తెలిపారు.

నడకతో ఆరోగ్యం



సమావేశంలో పాల్గొన్న వాకింగ్ క్లబ్ సభ్యులు

రాయగడ: ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతిరోజూ వ్యాయామం చేయాలని ముఖ్యంగా నడక అలవాటు చేసుకోవాలని సాయిప్రియ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ ఎం.సురేష్‌కుమార్ అన్నారు. స్థానిక సాయిప్రియనగర్‌లో ఆదివారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నడక మనిషికి ఆరోగ్యాన్ని అందిస్తుందన్నారు. వాకర్స్ క్లబ్ ద్వారా అందరికీ అవగాహన కల్పించేందుకు ఆరోగ్య సూత్రాలను వివరిస్తున్నామని చెప్పారు. అనంతరం క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టనున్న భవిష్యత్ కార్యక్రమాలపై చర్చించారు.

ఆశ్రమ పాఠశాలలో.. అలజడి

- చిత్రంగపల్లిలో డిఫ్తీరియాతో విద్యార్థి మృతి
- మరో 8 మంది చిన్నారులకు అస్వస్థత
- రక్తనమూనాల సేకరణ



మృతిచెందిన శిబో మడ్కమి

మల్కన్‌గిరి:

జిల్లాలోని కలిమెల సమితి చిత్రంగపల్లి గ్రామంలో గల ఆశ్రమ పాఠశాలలో డిఫ్తీరియా వ్యాధి కలకలం రేపుతోంది. పలువురు విద్యార్థులు వ్యాధి బారిన పడి ఆస్పత్రి పాలయ్యారు. నాలుగో తరగతి విద్యార్థి శిబో మడ్కమి దగ్గు, జ్వరంతో బాధపడుతుండటంతో ఇటీవల కలిమెల ఆరోగ్య కేంద్రంలో చేర్పించారు. అక్కడ నయం కాకపోవడంతో ఈ నెల 15న మల్కన్‌గిరిలోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో ఈ నెల 17న కొరాపుట్‌లోని సహిద్ లక్ష్మణ్ నాయిక్ ప్రభుత్వాస్పత్రికు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 20న విద్యార్థి మృతి చెందాడు. ఇదే పాఠశాలలో చదువుతున్న మరో ముగ్గురు విద్యార్థులు కూడా దగ్గు, జ్వరంతో బాధపడుతుండటంతో స్థానిక వైద్యసిబ్బంది చిన్నారుల రక్త నమూనాలు సేకరించి కొరాపుట్ పంపించారు. ఫలితాల్లో డిఫ్తీరియా వ్యాధిగా తేలింది. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉండే పిల్లల్లో ఈ వ్యాధి వస్తుందని వైద్యులు తెలిపారు. ఈ మేరకు కొరాపుట్ నుంచి వచ్చిన ప్రత్యేక వైద్య బృందం ఆదివారం చిత్రంగపల్లి పాఠశాలకు వచ్చారు. విద్యార్థులందరికీ రక్త పరీక్షలు నిర్వహించారు. ఎనిమిది మందిని కలిమెల ఆరోగ్య కేంద్రంలో చేర్పించి చికిత్స అందిస్తున్నట్లు డాక్టర్ దినోబంధు మహానాథో తెలిపారు. సరైన మందులు వాడితే వ్యాధి తగ్గిపోతుందని తెలిపారు.



కలిమెల ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న విద్యార్థులు



పాఠశాలలో సిబ్బందితో మాట్లాడుతున్న వైద్యులు



రక్త పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

దయచేసి వినండి.. స్థలాలు ఖాళీ చేయండి

- ఆక్రమణదారులకు రైల్వే శాఖ నోటీసులు
- 15 రోజులు గడువు
- ఆందోళనలో బస్తీవాసులు



బస్తీలను ఖాళీ చేయాలని నోటీసులను అతికించిన రైల్వే శాఖ



రైల్వే స్థలంలో ఉన్న బస్తీ

రాయగడ: రైల్వే డివిజన్ ఏర్పాటుకు మార్గం సుగమం కావడంతో అందుకు అవసరమైన పనులను అధికారులు వేగవంతం చేస్తున్నారు. దీనిలో భాగంగా కొన్నాళ్లుగా రైల్వే స్థలాలను ఆక్రమించుకుని ఇళ్లను నిర్మించుకుని ఉన్న వారిని ఖాళీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రాయగడ పట్టణంలోని రైల్వే స్థలాల్లో ఉన్న ఇళ్లను, బస్తీలను ఖాళీ చేయాలని తాజాగా నోటీసులు జారీ చేశారు. పదిహేను రోజుల్లో ఖాళీ చేయని పక్షంలో ఇళ్లను తొలగిస్తామని నోటీసుల్లో పేర్కొన్నారు. దీంతో ఆక్రమణదారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. కొద్ది నెలల కిందటే పట్టణంలోని పలు ప్రాంతాల్లో రైల్వే స్థలాల్లోని బస్తీలను తొలగించిన రైల్వే శాఖ ఇటీవల కాలంలో కాస్త నెమ్మదించింది. దీంతో తమకు ఎటువంటి ఇబ్బందులు లేవని ఆక్రమణదారులు ఊపిరిపీల్చుకున్నారు. తాజాగా రైల్వే శాఖ నోటీసులు జారీ చేయడంతో ఆందోళనకు గురవుతున్నారు. ఈసారి తప్పకుండా ఆక్రమణలను తొలగించేందుకు అధికారులు నిర్ణయించిన నేపథ్యంలో తామంతా నిరాశ్రయులమవుతామని, ఇల్లు లేక ఎక్కడి వెళ్లాలో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక మజ్జిగౌరి మందిరం సమీపంలోని భీమో వీధి, కంద్రవీధి, డైలీ మార్కెట్, సంతోషిమాత మందిరం ప్రాంతాలను తొలగించేందుకు ఇప్పటికే నోటీసులు జారీ అవ్వగా తాజాగా మరోసారి రైల్వే శాఖ ఆయా ప్రాంతాలను ఖాళీ చేయాలని నోటీసులను అతికించింది.

జగన్నాథ భక్తులకు ఉచిత ప్రసాదం

భువనేశ్వర్: పూరీ శ్రీమందిరంలో జగన్నాథుని దర్శించుకున్న ప్రతిభక్తునికి ఉచిత ప్రసాదం అందించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు రాష్ట్ర న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ ఆదివారం ప్రకటించారు. ప్రభుత్వ యోచన త్వరలోనే కార్యరూపం దాల్చనుందని తెలిపారు. స్థానిక జయదేవ్ భవన్‌లో ఏర్పాటు చేసిన జగన్నాథ సంస్కృతి పరిషత్ వార్షికోత్సవ సభలో పాల్గొన్న మంత్రి ఈ విషయం వెల్లడించారు. జగన్నాథుని క్షేత్రమైన పూరీ ఉన్నత శ్రేణి ప్రపంచ పట్టణంగా రూపు దిద్దుకుంటుందని చెప్పారు. వచ్చే ఏడాది జగన్నాథుని రథయాత్ర అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రముఖ దేవస్థానంలో ప్రసాదాల తయారీలో కల్తీ నెయ్యి వినియోగం వివాదం తీవ్ర కలకలం రేపిన నేపథ్యంలో శ్రీమందిరం ప్రసాదాల తయారీలో వినియోగిస్తున్న అన్ని ద్రవ్యాల్ని ఆలయం వెలుపల నుంచి క్షుణ్ణంగా తనిఖీ చేయించాకే లోపలికి అనుమతించనున్నట్లు స్పష్టం చేశారు. దీని కోసం అనుబంధ యంత్రాంగం ప్రత్యేకంగా ఏర్పాటు కానుందన్నారు. పోటు నుంచి బయటకు వచ్చే మహా ప్రసాదాల నాణ్యతని తనిఖీ చేయనున్నట్లు తెలిపారు. అనంతరం సుదర్శన్ సాహు, శ్యామామణి పట్నాయక్, నరేష్ చంద్రదాస్, సారంగధర్ రాయగురు, షేక్ మక్బుల్ ఇస్లాం, ధీరేంద్ర కుమార్, తనుశ్రీ జెనా, రామకృష్ణ దాస్ మహాపాత్రో, దుర్గాదాస్, శరత్ చంద్ర మహంతిలను 'శ్రీ పురుషోత్తమ సమ్మాన్'తో సత్కరించారు. కార్యక్రమంలో జగన్నాథ సంస్కృతి పరిషత్ అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే సంచిత మహంతి, ముఖ్య సలహాదారు ప్రభాత్‌కుమార్ నొండో, శాస్త్రవేత్త శ్యామసుందర్ మహాపాత్రో తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలతోనే ఉపాధి అవకాశాలు



మాట్లాడుతున్న సెంచూరియన్‌వర్సిటీ రిజిస్ట్రార్ అనితా పాత్ర్



హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు

పర్లాకిమిడి: బీటెక్, అగ్రికల్చర్, వెటర్నరీ, ఫార్మసీ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందిస్తున్నామని, తద్వారా ఎంఎన్‌సీ కంపెనీల్లో మంచి ఉద్యోగాలు సాధిస్తున్నారని సెంచూరియన్ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ అనితా పాత్ర్ అన్నారు. ఆదివారం సెంచూరియన్ వర్సిటీ ఓపెన్ ఆడిటోరియంలో విద్యార్థులు, తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెంచూరియన్ వర్సిటీలో స్మార్ట్ వ్యవసాయం, పశువైద్యం, ఫార్మసీ, నర్సింగ్, ఇంజినీరింగ్‌తో పాటు మరికొన్ని కోర్సులు ప్రవేశపెడుతున్నట్టు ప్రకటించారు. ముఖ్యంగా స్పోకెన్ ఇంగ్లిష్, వ్యక్తిత్వ వికాసం అలవర్చుకుంటే అత్యుత్తమ ఉపాధి అవకాశాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ ప్రజ్ఞాపాణి, డైరెక్టర్ (అడ్మిన్) డా.దుర్గాప్రసాద్ పాఢీ, మనోజ్‌కుమార్ బిశ్వాల్, జనరల్ మేనేజర్ ఫాల్గుణరావు, ప్లేస్‌మెంట్ అధికారి ఎస్.కామేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రాలో మాయం.. ఒడిశాలో బేరం



వివరాలు వెల్లడిస్తున్న అదనపు ఎస్పీ సునీల్‌కుమార్ మహంతి, ఐఐసీ ప్రశాంత్ భూపతి

- ద్విచక్ర వాహనాల నిందితుడు అరెస్టు
- 19 ద్విచక్ర వాహనాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు

పర్లాకిమిడి: మోటారుసైకిళ్లను చోరీ చేస్తున్న నిందితుడిని అరెస్టు చేసి 19 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు అదనపు ఎస్పీ సునీల్‌కుమార్ మహంతి తెలిపారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 27న రాత్రి ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ఫారెస్టు గేటు వద్ద ఎస్ఐ లక్ష్మణ్ బెహరా, సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా బులెట్ బండిపై వస్తున్న ఇద్దరిని ఆపారు. వివరాలు ఆరా తీసి బైక్ నంబర్ ప్లేట్ ఓడీ67 ఎ–8763ను పరిశీలించగా ఫేక్‌గా గుర్తించారు. పట్టుబడిన రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ శ్రీకాకుళం జిల్లా పలాసలో దొంగిలించినట్టు నిందితుడు రమిరి రఘునాథం అలియాస్ రఘుప్రధాన్ అంగీకరించాడు. ఇతని స్వగ్రామం పలాస మండలం పెదంచల. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టగా.. అతని వద్ద మరో 18 ద్విచక్ర వాహనాలు ఉన్నట్లు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఇవన్నీ పలాస, పాతపట్నం పరిసర ప్రాంతాల్లో దొంగిలించినవని గుర్తించారు. ఆంధ్రాలో చోరీ చేసి నంబర్ ప్లేట్లు మార్చి ఒడిశాలో విక్రయిస్తుంటాడని విచారణలో తేలింది. పరారీలో ఉన్న మరో నిందితుడి కోసం గాలిస్తున్నట్లు ఆదర్శ పోలీసుస్టేషన్ ఐఐసీ ప్రశాంత్ భూపతి తెలిపారు. సమావేశంలో పాతపట్నం సీఐ ఎస్.సాయి, సబ్ డివిజన్ పోలీస్ అధికారి మాధవానంద నాయక్, ఎస్ఐ పంచాన బెహరా తదితరులు పాల్గొన్నారు.

ఐపీఎస్ అధికారుల బదిలీ

భువనేశ్వర్: రాష్ట్రంలో 27 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర హోం శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కటక్, భువనేశ్వర్ జంట నగరాల పోలీసు కమిషనరుగా సురేష్ దేవదత్త సింగ్ నియమితులయ్యారు. ఇంతవరకు బాధ్యతలు నిర్వహించిన సంజీబ్ పండా స్థానిక బిజూ పట్నాయక్ స్టేట్ పోలీసు అకాడమీ శిక్షణ విభాగం అదనపు డైరెక్టరు జనరల్, డైరెక్టరుగా బదిలీ అయ్యారు. ఇంటిలిజెన్సు విభాగం డైరెక్టర్‌గా ఆర్.పి.కోచే నియమితులయ్యారు.

భద్రక్‌లో మరో 48 గంటలు ఇంటర్నెట్ సేవలు బంద్

భువనేశ్వర్: వివాదాస్పదమైన సోషల్ మీడియా ప్రసారంతో తలెత్తిన వివాదంతో భద్రక్ పట్టణంలో పరిస్థితి అట్టుడికిపోతోంది. ఈ దుమారంతో చెలరేగిన ఘర్షణలతో పోలీసులపై రాళ్ల దాడి చోటు చేసుకుని పలువురు గాయపడ్డారు. పరిస్థితి చేయిదాటకుండా ఈ ప్రాంతంలో తొలుత 48 గంటల పాటు ఇంటర్నెట్ సేవల్ని నిలిపివేసిన ప్రభుత్వం తాజాగా మరో 48 గంటల పాటు సేవలు నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ ఘటనలో ఇప్పటి వరకు 15 మందిని అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రధాన నిందితుడిని శనివారం అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి దుర్మరణం

- రాస్తారోకో చేపట్టిన బంధువులు
- నిలిచిపోయిన వాహనాలు



సుజిత్‌నాయక్ (ఫైల్)

పర్లాకిమిడి:

గజపతి జిల్లా మోహానా బ్లాక్ ఖర్చబడి పంచాయతీ సుఖిలా అంబో వద్ద ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో కళాశాల విద్యార్థి దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోహానా సమితి అడవ గ్రామంలోని క్రిస్టియన్ వీధికి చెందిన సుజిత్‌నాయక్ (22) జి.ఎ.జి. హిల్‌టాప్ కళాశాలలో డిగ్రీ సెకెండియర్ చదువుతున్నాడు. ఆదివారం కళాశాల సెలవు కావడంతో సొంత పనిపై మోహానా నుంచి అడవ గ్రామానికి బైక్‌పై తిరిగి వస్తుండగా.. జాతీయ రహదారి–326 మలుపు వద్ద అడవ నుంచి వస్తున్న గుడ్ల వ్యాన్ పరస్పరం ఢీకొట్టాయి. ఈ ఘటనలో బైక్ పైనుంచి ఎగిరిపడటంతో సుజిత్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు ఘటనా స్థలానికి చేరుకుని రాస్తారోకో చేపట్టారు. నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. దీంతో బరంపురం– రాయగడ వెళ్లే వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.



మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు



మోహానా వద్ద రాస్తారోకో చేస్తున్న బంధువులు

క్లుప్తంగా

లైంగికదాడి కేసులో నిందితుడి అరెస్టు

సారవకోట: మండలంలో మూగుపురం గ్రామానికి చెందిన 9వ తరగతి చదువుతున్న బాలికపై అత్యాచారం చేసిన కేసులో ఆ గ్రామానికి చెందిన బుద్దల హేమసుందరరావును శనివారం రాత్రి అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ అనిల్‌కుమార్ తెలిపారు. బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శ్రీకాకుళం మహిళా పోలీసుస్టేషన్ డీఎస్పీ రాజశేఖర్ విచారణ చేపట్టి యువకుడిని అరెస్టు చేసి పాతపట్నం కోర్టులో హాజరు పర్చగా కోర్టు రిమాండ్ విధించినట్లు ఆయన తెలిపారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఆర్‌జీయూకేటీ విద్యార్థులు



రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్‌జీయూకేటీ) విద్యార్థులు రాష్ట్రస్థాయి హాకీ జట్టుకు ఎంపికయ్యారు. శ్రీకాకుళం పట్టణంలో ఈ నెల 28వ తేదీన జరిగిన జిల్లాస్థాయి స్కూల్ ఫెడరేషన్ గేమ్స్‌లో పాల్గొని ఉత్తమ ప్రతిభ ద్వారా ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన తరుణ్‌కుమార్, మహబూబ్, మనోజ్ కుమార్‌లను క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకటగోపాల ధనబాలాజీ, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ కొర్ల మోహన్‌కృష్ణ చౌదరి ఆదివారం ప్రత్యేకంగా అభినందించారు.

జాతీయ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ముగ్గురికి పతకాలు



బ్యాడ్మింటన్ సంఘ జాతీయ ప్రతినిధులు, కోచ్ కోడి మోహన్‌తో జిల్లా క్రీడాకారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారులు ఎస్.ప్రవీణ్‌కుమార్, జి.ఛాయాకిరణ్, జి.జ్యోత్స్న పతకాలు సొంతం చేసుకున్నారు. హరియాణాలోని రోతక్ వేదికగా ఈ నెల 25 నుంచి 29వ తేదీ వరకు జరిగిన 43వ ఆలిండియా సబ్‌జూనియర్స్ బాలబాలికల బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో బాలురు జట్టు చాంపియన్‌గా నిలిచి బంగారు పతకాలు సాధించగా, బాలికల జట్టు రన్నరప్‌గా నిలిచి రజత పతకలు సాధించారు. జిల్లా నుంచి ఎస్.ప్రవీణ్‌కుమార్ (10వ తరగతి- జీహెచ్‌స్కూల్ ఎచ్చెర్ల), జి.ఛాయాకిరణ్ (10వ తరగతి- కాశీబుగ్గ గురుకుల ప్రైవేటు పాఠశాల) బాలురు జట్టుకు, బెండి జ్యోత్స్న (10వ తరగతి- జెడ్పీహెచ్‌స్కూల్ ఒప్పంగి) బాలికల జట్టుకు ఆడి పతకాలు దక్కించుకున్నారు. వీరిలో ప్రవీణ్‌కుమార్ అత్యుత్తమ ఆటతీరును కనబర్చి స్టార్ ఆఫ్ ఇండియాకు ఎంపికయ్యాడు.

రూపక్ రెడ్డి కుటుంబానికి ఒడిశా ఎంపీ పరామర్శ



రూపక్‌రెడ్డికి నివాళులు అర్పిస్తున్న ఒడిశా, ఆంధ్రా ప్రజాప్రతినిధులు

ఇచ్ఛాపురం రూరల్: మండపల్లి ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పెదిని రవిరాజ్‌రెడ్డి కుమారుడు రూపక్‌రెడ్డి ఇటీవల అమెరికాలో ఓ ప్రమాదంలో చనిపోయారు. ఆయన స్వగ్రామం ఆంధ్రా-ఒడిశా సరిహద్దు పితాతొలిలో ఆదివారం జరిగిన సంస్మరణ సభకు ఒడిశా ఎంపీ ప్రదీప్ పాణిగ్రహి, చీకటి ఎమ్మెల్యే మనోరంజన్‌దాస్‌లు హాజరయ్యారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు నర్తు నరేంద్ర యాదవ్‌తో కలసి రూపక్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించి శ్రద్ధాంజలి ఘటించారు.

రామలింగేశ్వరునికి కిరణ స్పర్శ



బొరివంక రామలింగేశ్వరస్వామి ఆలయంలో కిరణ స్పర్శిస్తున్న దృశ్యం

కవిటి: మండలంలోని బొరివంకలో వెలసిన శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం స్వామిని తొలి సూర్యకిరణాలు స్పృశించాయి. ఆలయ గర్భగుడిలో ఏర్పాటు చేసిన ఉత్సవ విగ్రహాలపై ఉదయం 6 గంటల సమయంలో ఐదు నిమిషాలపాటు ఈ అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది.

సంతాలి భాష.. డిజిటలైజేషన్ అద్భుతం

- మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ
- మయూర్‌భంజ్ యువకుడు రాజ్‌జీత్‌కు అభినందనలు



భువనేశ్వర్: మయూర్‌భంజ్ జిల్లా యువకుడిని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అభినందనలతో ముంచెత్తారు. మన్ కీ బాత్ 114వ కార్యక్రమంలో మోదీ మాట్లాడుతూ మయూర్‌భంజ్ జిల్లాకు చెందిన యువకుడు రామ్‌జీత్ టుడు సంతాలీ భాషను డిజిటలైజేషన్ చేయడాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. యువకుడి అద్భుత కృషితో అతి తక్కువగా వాడకంలో ఉన్న మారు మూల ప్రాంతీయ భాష సంతాలీకి అంతర్జాతీయ గుర్తింపు సాధించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. మాతృ భాష పట్ల గుండెలోతుల్లో అభిమానం, మమకారం ఇటువంటి ఆవిష్కరణలకు ప్రాణం పోస్తుందన్నారు. అతి తక్కువ మంది వినియోగించే ఇటువంటి భాషలకు డిజిటల్ వేదికపై ప్రదర్శించడం అభినందనీయమన్నారు. ఇలాంటి సృజనాత్మక స్ఫూర్తి యువతలో ప్రేరణగా నిలుస్తుందని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి కూడా కొనియాడారు. ప్రధాని, ముఖ్యమంత్రుల అభినందనలతో రామ్‌జీత్ టుడు పేరు రాష్ట్రవ్యాప్తంగా మారుమోగిపోతోంది.



డిజిటల్ అక్షరాల్లో 'సంతాలి ఓల్ చికి' లిపి

ఖనిజ సంపద దోచేందుకు కుట్ర



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి ఆశిష్ కనుంగో

జయపురం: ఒడిశాలో ఆదివాసీని ముఖ్యమంత్రిగా చేసి రాష్ట్ర జల సంపద, ఆదివాసీ ప్రాంతాల్లో ఖనిజ సంపదను కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేసేందుకు ప్రధాని మోదీ ప్రయత్నిస్తున్నారని రాష్ట్ర కమ్యూనిస్టు పార్టీ జనరల్ సెక్రటరీ ఆశిష్ కనుంగో ఆరోపించారు. ఆదివారం జయపురంలోని యాదవ భవనంలో కొరాపుట్, మల్కనగిరి జిల్లాల పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్లాక్ కార్మిక చట్టాలతో కార్మికుల హక్కులను కాలరాశారని దుయ్యబట్టారు. దేశంలో పేదల శాతం పెరుగుతోందని, 15 శాతం మంది వ్యక్తుల చేతుల్లో దేశ సంపద నిక్షిప్తమైందన్నారు. సేవాపేపర్ మిల్లు వంటి పరిశ్రమలు మూతపడుతూ నిరుద్యోగం తాండవిస్తున్నా, ధరలు పెరుగుతున్నా బీజేపీ పాలకులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం సాగించేందుకు వామపక్షవాదులు ఏకం కావాలని పిలుపునిచ్చారు. డిసెంబర్ 26న కమ్యూనిస్టు పార్టీ శతవార్షిక మహోత్సవాలు జరగనున్నాయని, అందరూ విజయవంతం చేయాలని కోరారు. జిల్లా సహాయ కార్యదర్శి రామకృష్ణదాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రమోద్‌కుమార్ మహంతి, ఏఐటీసీయూ రాష్ట్ర కార్యదర్శి బిజయ జెనా, మల్కనగిరి కార్యదర్శి హలధర పూజారి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం


పర్లాకిమిడి: జిల్లాలో గుసాని సమితి ఉప్పలాడ ఠాగోర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇటీవల నిర్వహించిన క్విజ్, చిత్రలేఖనం పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి ఆదివారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు క్విజ్ వంటి పోటీల్లోనూ విద్యార్థులు ప్రాతినిధ్యం వహించి పోటీతత్వం అలవరుచుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ అధ్యక్షులు గవర తిరుపతిరావు, గుసాని సమితి చైర్మన్ ఎస్.వీర్రాజు, గుసాని జెడ్పీటీసీ ఎస్.బాలరాజు, ఆర్.ఎం.సీ.అధ్యక్షుడు ఎస్.గజపతిరావు, గుసాని సమితి శిక్షాధికారి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి

ముగిసిన బాల గణపతి ఉత్సవాలు

జయపురం: జయపురంలోని మహాత్మాగాంధీ రోడ్డులో బాలగణపతి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక చవితి ఉత్సవాలు శనివారం రాత్రితో ముగిశాయి. 77 ఏళ్లుగా ఇక్కడ ఏటా వైభవంగా వేడుకలు నిర్వహిస్తున్నారు. ముగింపు కార్యక్రమంలో ముందుగా గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేషధారణలు, నృత్యాలు చేస్తూ గణనాథుడిని ఊరేగింపుగా తీసుకెళ్లి పూర్ణఘడ్ సమీపంలోని కొలాబ్ కెనాల్‌లో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు రత్నాల కిశోర్‌కుమార్, కమిటీ సభ్యులు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.



బాలగణపతి ప్రతిమ



ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

తండ్రి మృతి.. కూతుళ్లకు అనుమానం

పాతపట్నం: అంతరాబ గ్రామంలోని స్టూడెంట్ కాలనీవీధిలో నివాసం ఉంటున్న కమ్మకట్ల రామయ్య (83) శనివారం రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. కానీ ఆయన మృతిపై కూతుళ్లు అనుమానం వ్యక్తం చేశారు. వారు అనుమానం వ్యక్తం చేసింది తమ సోదరిపైనే కావడం గమనార్హం. వివరాల్లోకి వెళితే.. రామయ్యకు ముగ్గురు కుమార్తెలు. అందరికీ వివాహాలయ్యాయి. రామయ్య భార్య చనిపోవడంతో చిన్నకుమార్తె సుగ్గు పుష్పలత తండ్రి వద్ద ఉంటూ బాగోగులు చూసుకుంటున్నారు. రామయ్యకు ఏడెకరాల పొలం, మూడు ఇళ్లు ఉన్నాయి. ఆస్తి విషయంలో పెద్ద కుమార్తె పరపతి లక్ష్మి, రెండో కుమార్తె ధర్మాన పద్మావతిలతో చిన్నకుమార్తెకు తరచూ గొడవలు జరిగేవి. పోలీస్‌స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేసుకున్నారు. పది రోజుల కింద చిన్నకుమార్తె తండ్రిని తన అక్కలకు తెలియకుండా గార మండలం వమ్మరవల్లిలోని తన అత్తవారింటికి తీసుకెళ్లింది. ఈ నెల 28న రామయ్యకు ఆరోగ్యం బాగులేకపోవడంతో రిమ్స్‌కు తీసుకెళ్లగా.. ఆయన అక్కడే చనిపోయారు. ఈ విషయాన్ని అక్కలకు పుష్పలత తెలియజేసి తండ్రి మృతదేహాన్ని అంతరాబ స్టూడెంట్ కాలనీకి తీసుకురాగా.. పద్మావతి, లక్ష్మిలు తమ సోదరిపై అనుమానం వ్యక్తం చేశారు. అనంతరం పాతపట్నం పోలీస్‌స్టేషన్‌లో పద్మావతి ఫిర్యాదు చేశారు. దీంతో ఏఎస్‌ఐ టి.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పాతపట్నం సీహెచ్‌కు తరలించి ఆదివారం ఉదయం పోస్టుమార్టం చేసి, బంధువుల సమక్షంలో మృతదేహాన్ని ముగ్గురు కుమార్తెలకు అప్పగించారు. తండ్రి మృతదేహానికి రెండో కుమార్తె పద్మావతి, చిన్న కుమార్తె పుష్పలత తలకొరివి పెట్టారు.



తండ్రికి తలకొరివి పెడుతున్న ఇద్దరు కుమార్తెలు

అన్ని రేషన్‌కార్డులకు ఈ-కేవైసీ

భువనేశ్వర్: రాష్ట్రంలో బీజేపీ పాలనా పగ్గాలు చేపట్టిన తర్వాత జాతీయ ఆహార భద్రత పథకం కింద ఆహార ధాన్యాల పంపిణీ కోసం రేషన్‌కార్డుల ఈ-కేవైసీ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఈ ప్రక్రియ రేపోమాపో ముగుస్తుందనే ప్రచారంతో లబ్ధిదారుల్లో భయాందోళనలు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఆహార, పౌర సరఫరాలు, వినియోగదారుల సంక్షేమ శాఖ మంత్రి కృష్ణచంద్ర పాత్రో స్పందించారు. ప్రస్తుత లబ్ధిదారుల్లో ప్రతిఒక్కరి కార్డు ఈ-కేవైసీ ముగిసేంత వరకు నిరవధికంగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. అంతవరకు ఆహార ధాన్యాల పంపిణీకి ఎటువంటి అంతరాయం కలగబోదని చెప్పారు. రాష్ట్రంలో దాదాపు 3 కోట్ల మంది ఆహార భద్రత లబ్ధిదారుల రేషను కార్డులకు ఈ-కేవైసీ నిర్వహించాల్సి ఉందన్నారు. సుమారు 2 కోట్ల మందికి ప్రక్రియ పూర్తయిందని చెప్పారు. మిగిలిన వారి పరిశీలన కూడా ముగిసే వరకు నిరంతరాయంగా ఆహార ధాన్యాల పంపిణీ కొనసాగుతుందన్నారు. రానున్న 30 నుంచి 45 రోజుల్లో రేషన్ కార్డుల ఈ-కేవైసీ ప్రక్రియ పూర్తి అవుతుందని తెలిపారు. నివేదిక వచ్చాక బూటకపు కార్డులు రద్దు చేసి కొత్త కార్డులు జారీ చేస్తామని మంత్రి ప్రకటించారు.

జిల్లాలకు కొత్త ఎస్పీలు

భువనేశ్వర్: రాష్ట్రంలో పలు జిల్లాలకు కొత్త పోలీసు సూపరింటెండెంట్లు నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం హోం శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

ఎస్పీ	జిల్లా
వినిత్ అగర్వాల్	పూరీ
వరుణ్ గుంటుపల్లి	మయూర్‌భంజ్
సాగరికనాథ్	ఖుర్దా
స్వాతి ఎస్.కుమార్	రాయగడ
ఎ.సుశ్రీ	నయాగఢ్
నితేష్ వాద్వానీ	రౌర్కెలా
రాజ్‌ప్రసాద్	బాలాసోర్
ఎస్.దేవరకొండ,	బౌధ్
సువేందుకుమార్ పాత్రో	గంజాం

1, 2 తేదీల్లో కిరణ దర్శనం

అరసవల్లి: అద్భుత కిరణ దర్శన సమయం వచ్చేసింది. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయంలో ఉత్తరాయణ, దక్షిణాయణ కాలమార్పుల్లో భాగంగా తొలి సూర్యకిరణాలు నేరుగా మూలవిరాట్టును స్పృశించే అరుదైన క్షణాలు అక్టోబర్ 1, 2 తేదీల్లో సూర్యోదయ సమయాన సాక్షాత్కరించనున్నాయి. ఏటా మార్చి 9, 10 తేదీల్లోనూ, అలాగే అక్టోబర్ 1,2 తేదీల్లో సూర్యోదయ సమయంలో నేరుగా సూర్యకిరణాలు గర్భాలయంలోని స్వామి వారి మూలవిరాట్టును తాకడం ఇక్కడి క్షేత్ర మహత్యంగా చెబుతుంటారు. ఈ మేరకు ఆలయంలో దర్శన ఏర్పాట్లను పక్కాగా చేపడుతున్నట్లుగా ఈఓ వై.భద్రాజీ, ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు ఆదివారం తెలియజేశారు. అయితే ఆకాశం మేఘావృతం అయితే కిరణాలు తాకే అద్భుత దృశ్యం కనిపించదని వెల్లడించారు. కిరణ దర్శనం కోసం ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు ముందుగా అరసవల్లి క్షేత్రానికి తరలిరానున్నారు. ఇందుకుగాను అనివెట్టి మండపం నుంచి మహా మండపం వరకు బారికేడ్ల ఏర్పాటు పనులను మంగళవారం సాయంత్రానికే పూర్తిచేసేలా చర్యలు చేపట్టనున్నారు.

నూతన విద్యా విధానంలోనే బోధన



అవగాహన కల్పిస్తున్న ఓఎస్‌డీ దేవీప్రసాద్

జయపురం: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రస్తుత విద్యా సంవత్సరంలో అన్ని కళాశాలల్లోనూ నూతన విద్యా విధానంలోనే బోధన జరుగుతుందని జయపురంలోని విక్రమ్‌దేవ్ విశ్వ విద్యాలయ ఓఎస్‌డీ ప్రొఫెసర్ దేవీప్రసాద్ మిశ్రా స్పష్టం చేశారు. జాతీయ నూతన విద్యా విధానంపై వర్సిటీలో 72 కళాశాలల ప్రిన్సిపాళ్లకు అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో డిగ్రీ కోర్సు మూడేళ్లు ఉండేదని, ఇకపై నాలుగేళ్లు చదవాల్సి ఉంటుందన్నారు. ఒడిశా రాష్ట్ర ఉన్నత విద్య కౌన్సిల్ రూపొందించిన సిలబస్‌ను అన్ని కళాశాలలు, స్వయం పాలిత కళాశాలల్లోనూ బోధించాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో కాలేజ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ డైరెక్టర్ మహేశ్వర దురియ, ప్రాంతీయ విద్య విభాగ డైరెక్టర్ డాక్టర్ గోపాల్ హల్దార్, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ రంజన్‌కుమార్ ప్రధాన్, పి.జి.కౌన్సిల్ చైర్‌పర్సన్ డాక్టర్ ప్రశాంత కుమార్ పాత్రో తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదాతలను సన్మానిస్తున్న సర్పంచ్, తదితరులు

జయపురం: అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందక ఎవరూ మరణించకూడదని, ప్రతిఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని రాష్ట్ర ఎస్టీ, ఎస్సీ, దళిత సమాజ్ మహిళా విభాగం అధ్యక్షురాలు మనస్విని టకిరి పిలుపునిచ్చారు. ఆదివారం జయపురం సమితి జయంతగిరి, అంబాగుడ పంచాయతీల పరిధిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎస్టీ, ఎస్సీ, ఓబీసీ సంఘాలు సంయుక్తంగా నిర్వహించిన ఈ శిబిరంలో ఆమె మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. అంతకుముందు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా 25 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. రక్తదాతలకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జయంతిగిరి సర్పంచ్ భద్ర పూజారి, త్రినాథ కంత, మంగళ తురుక్, ఆశారాణి పాత్ర, బాసు నాయిక్, గొణి ముదులి, జయ ముదులి, బిశి ముదులి, దిలీప్‌కుమార్ హను తదితరులు పాల్గొన్నారు.

సాంఘిక శాస్త్ర సిలబస్‌ను తగ్గించాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: సాంఘిక శాస్త్ర(సోషల్ స్టడీస్) సిలబస్ విద్యార్థులకు అమితమైన భారంగా ఉందని, ప్రభుత్వం కనీసం వచ్చే విద్యా సంవత్సరం నుంచైనా తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని ఏపీ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయ ఫోరం రాష్ట్ర కార్యదర్శి కరిమి రాజేశ్వరరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయ ఫోరమ్ జిల్లా సర్వసభ్య సమావేశం ఆదివారం నగరంలోని భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ భవన్‌లో ఆ ఫోరం జిల్లా అధ్యక్షుడు తులగాపు కేశవరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు నైతిక విలువలు జోడించి విద్యార్థులకు పాఠాలు బోధించడం ద్వారా నవ సమాజ నిర్మాణానికి పాటుపడాలన్నారు. ప్రతి పాఠశాలకు సాంఘిక శాస్త్ర ప్రయోగశాలను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తులగాపు కేశవరావు, బాడాన రాజు మాట్లాడుతూ సాంఘిక శాస్త్రంలో సిలబస్ భారం తగ్గించాలని, లేకుంటే విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ప్రతి పాఠశాలకు ఇద్దరేసి సోషల్ స్టడీస్ ఉపాధ్యాయులను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఫోరమ్ ఆధ్వర్యంలో నిర్వహించబోయే సాంఘిక శాస్త్ర టాలెంట్ టెస్ట్‌ను విజయవంతం చేయాలన్నారు. నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని సాంఘికశాస్త్ర దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ఘనంగా నిర్వహించాలని వారు పిలుపు నిచ్చారు. జిల్లా ఆర్గనైజింగ్ కన్వీనర్లు మక్కా శ్రీనివాసరావు, ఎల్.గుణశేఖర్ మాట్లాడుతూ సాంఘికశాస్త్ర సిలబస్ పరిధిని దృష్టిలో పెట్టుకొని పని సర్దుబాటు నుంచి సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులను మినహాయింపు ఇవ్వాలని విద్యాశాఖ ఉన్నతాధికారులను కోరారు. కార్యక్రమంలో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయ ఫోరం జిల్లా ప్రతినిధులు ఆర్.అన్నాజీరావు, పీవీఆర్.మూర్తి, టి.రమణ సీహెచ్ సుబ్బలక్ష్మి, ఎస్.స్వప్న, బి.ముకుందరావు, కె.సంతోష్‌కుమార్, జి.గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.



ఏపీ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయ ఫోరం జిల్లా శాఖ ప్రతినిధులు

గుండె వ్యాధులపై అవగాహన ర్యాలీ

శ్రీకాకుళం అర్బన్: ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా ఆదివారం నగరంలోని కిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో కిమ్స్ ఆస్పత్రి నుంచి డే అండ్ నైట్ కూడలి వరకూ గుండె వ్యాధులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కిమ్స్ ఆస్పత్రి గుండె వ్యాధి నిపుణులు డాక్టర్ కిల్లి సతీష్, డాక్టర్ కల్యాణ చక్రవర్తిలు మాట్లాడుతూ గుండె వ్యాధులు రాకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి రోజూ మంచి జీవనశైలి, చక్కటి ఆహార అలవాట్లు, వ్యాయామం, యోగా చేయడం ద్వారా గుండె జబ్బులకు గురయ్యే అవకాశం తక్కువగా ఉంటుందన్నారు. మద్యపానం, ధూమపానం వంటి అలవాట్లు మానుకోవాలని సూచించారు. కిమ్స్ ఆస్పత్రి డైరెక్టర్ డా.గూడేన సోమేశ్వరరావు మాట్లాడుతూ జిల్లా ప్రజలకు మొట్టమొదట గుండె జబ్బులకు వైద్యసేవలు అందించిన ఆస్పత్రి కిమ్స్ అని, అన్ని రకాల గుండె వైద్య సేవలు, ఆరోగ్యశ్రీ, ఈహెచ్ఎస్ పథకం ద్వారా వైద్య సేవలు ఉచితంగా అందిస్తున్నట్లు వివరించారు. ర్యాలీలో కిమ్స్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పీఆర్ సోమేశ్వరరావు, ఆపరేషన్స్ వేదవతి, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.



కిమ్స్ వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

గగుర్పాటు..

ఓ భారీ నాగుపాము మరో నాగు పామును అమాంతంగా మింగేసిన ఘటన పలాస రైల్వే కాలనీలో ఆదివారం చోటుచేసుకుంది. రైల్వే కాలనీలో ఎస్సీ, ఎస్టీ కార్యాలయం గేటు దగ్గర రెండు పాముల మధ్య భీకరమైన పోరు జరుగుతున్నట్లు రైల్వే పారిశుధ్య కార్మికులు, స్థానికులు గుర్తించారు. వాటిని దగ్గర నుంచి పరిశీలించగా ఒక పామును మరో భారీ నాగుపాము నోట కరిచి మింగేస్తోంది. ఈ దృశ్యం వారికి గగుర్పాటును కలిగించింది. భారీ నాగుపాము అక్కడే తిష్ట వేయడంతో అటవీ శాఖాధికారులకు స్థానికులు సమాచారమిచ్చారు. కాశీబుగ్గ అటవీశాఖ రేంజ్ ఆఫీసర్ ఎ.మురళీ కృష్ణమనాయుడు ఆదేశాల మేరకు ఈస్టర్న్ గార్డ్ వైల్డ్ లైఫ్ సొసైటీకి చెందిన స్నేక్ క్యాచర్ ఓంకార్ త్యాడీ భారీ నాగుపామును పట్టుకుని కోసంగిపురం సమీపంలోని అటవీప్రాంతంలో విడిచి పెట్టారు. కోబ్రా జాతి సంతతికి చెందిన సర్పాల మధ్య ఆహార అన్వేషణలో చిన్న పాము పెద్దపాముకు ఆహారం అవడం సాధారణమని అన్నారు.

– కాశీబుగ్గ



చిన్నపామును మింగుతున్న మరోపాము



పామును తన ఆధీనంలోకి తీసుకుంటున్న స్నేక్ క్యాచర్ ఓంకార్ త్యాడీ

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో రాణించాలి

- అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు



రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

తెర్లాం: వచ్చే నెల 5,6,7 తేదీల్లో విశాఖపట్నం జిల్లా నునపర్తిలో జరగనున్న రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లా జట్లుకు ఎంపికైన క్రీడాకారులంతా బాగా రాణించాలని బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు టి.శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు తెర్లాం మండలంలోని నెమలాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు జిల్లా బాలురు, బాలికల జట్ల ఎంపికను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులంతా అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మంచిపేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ జి.సుందరరావు, అసోసియేషన్ సభ్యులు, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి సెపక్‌తక్రా పోటీలకు జిల్లా జట్లు సిద్ధం



రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న సెపక్‌తక్రా పోటీల్లో పాల్గొననున్న బాల,బాలికల జిల్లా జట్లు సిద్ధమయ్యాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నగరంలోని వీటీ అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అండర్-14,17,19 వయస్సుల విభాగాల్లో ఎంపికలు నిర్వహించగా..జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన 60మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు త్వరలో రాష్ట్రస్థాయిలో జరగనున్న అంతర్ జిల్లాల పోటీల్లో విజయనగరం జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించనున్నారు. ఎంపిక పోటీలను స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి కె.కృష్ణంరాజు, పీడీలు కేవీఎస్ రాజు, బంగార్రాజు, జి.ధర్మారావు, డి.ప్రవీణ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేశ్వరరావులు పర్యవేక్షించారు.

6న ఉత్తరాంధ్ర కోలాట ప్రదర్శన పోటీలు

బొబ్బిలి: ఉత్తరాంధ్ర స్థాయి కోలాట ప్రదర్శన పోటీలను అక్టోబర్ 6న నిర్వహిస్తున్నట్లు శ్రీకళాభారతి మున్సిపల్ ఆడిటోరియం ప్రధాన కార్యదర్శి నంబియార్ వేణుగోపాల రావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఆడిటోరియంలో కళాకారులతో కలిసి మాట్లాడుతూ జాతీయ కోలాట దినోత్సవమైన అక్టోబర్ 4న నిర్వహిస్తున్న ఈ పోటీలకు ఉత్తరాంధ్రలోని కళాకారులు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. బొబ్బిలి కళాకారుల సమాఖ్య సభ్యుల సహకారంతో నిర్వహిస్తున్న ప్రాచీన సంప్రదాయ కళారూపాల ప్రదర్శనలో ఉత్తరాంధ్రలోని జిల్లాల కళాకారులు పాల్గొనవచ్చున్నారు. మొదటి ఆరుస్థానాలకు మెమెంటోలు, ప్రశంసా పత్రాలు అందజేస్తామన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 7799808286 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎం.విజయమోహన్, జి.కరుణ కుమార్, బీజీ గంగాధర్, మీసాల గౌరునాయుడు, చప్ప అప్పలనాయుడు, టీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

'జన్ జాతీయ ఉన్నత్ గ్రామ్ అభియాన్'తో.. గిరిజన ప్రాంతాల అభివృద్ధి

విజయనగరం అర్బన్: గిరిజన తెగల వారు నివసించే ప్రాంతాల్లో వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా మౌలిక వసతులను కల్పించేందుకు, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు ఉద్దేశించి కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న జన్ జాతీయ ఉన్నత్ గ్రామ్ అభియాన్ పథకాన్ని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అక్టోబరు 2న వర్చ్యువల్‌గా ప్రారంభించనున్నట్లు కలెక్టర్ డా. బీఆర్ అంబేడ్కర్ వెల్లడించారు. ఆదిమ గిరిజన తెగల వారు నివసించే దేశంలోని 100 జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారని, అందులో విజయనగరం జిల్లా కూడా వున్నట్టు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఎస్.కోట, గంట్యాడ, బాడంగి, బొబ్బిలి, బొండపల్లి, గజపతినగరం, గరివిడి, జామి, తెర్లాం, వేపాడ, మెంటాడ తదితర 11 మండలాల్లో గిరిజనులు నివసించే గ్రామాల్లో ఈ పథకం కింద అభివృద్ధి పనులు చేపట్టేందుకు అవకాశం వుందన్నారు. కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియం నుంచి జిల్లాకు చెందిన గిరిజనులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు ప్రధానమంత్రి నిర్వహించే ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారని వెల్లడించారు. ఈ సందర్భంగా గిరిజనులకు సేవలందిస్తున్న పలు ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో స్టాల్స్ కూడా ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు. కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

నేటితో సరి..!

- ముగియనున్న ప్రభుత్వ మద్యం షాపులు
- ఆందోళనలో ఉద్యోగులు

జిల్లాలో ఏపీ బెవరేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ ఉద్యోగులు	
సూపర్‌వైజర్లు	53 మంది
సేల్స్‌మెన్	159 మంది
వాచ్‌మెన్	48 మంది



పార్వతీపురం పట్టణంలో మద్యం అమ్మకాలు చేపడుతున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు

పార్వతీపురం టౌన్: వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో స్థానికులకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో నూతన మద్యం పాలసీలో భాగంగా కొందరికి ఉద్యోగాలు కల్పించారు. అయితే ఆ ఉద్యోగాలకు ప్రస్తుత ప్రభుత్వం ఎసరు పెట్టింది. అక్టోబర్ ఒకటి () నుంచి నూతన మద్యం పాలసీని అమలు చేయనున్నామనే ప్రకటనతో మద్యం దుకాణాల్లో పనిచేసే ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. మద్యం దుకాణాల్లో అక్రమాల కట్టడికి, బెల్టు షాపుల నియంత్రణకు గత ప్రభుత్వం ఉద్యోగులను నియమించి ప్రభుత్వం పర్యవేక్షణలోనే మద్యం విక్రయాలు నిర్వహించింది. ఈ క్రమంలో పలువురు నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించింది. సూపర్‌వైజర్, సేల్స్‌మన్, నైట్ వాచ్‌మన్ ఉద్యోగాలు ఇచ్చింది. ఒక్కో షాపులో నలుగురి నుంచి ఐదుగురికి ఉపాధి కల్పించింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మద్యం దుకాణాలను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు సిద్ధమవుతుండడంతో తమ భవిష్యత్ ఏమిటోనని వారు దిగులు చెందుతున్నారు.

ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలి



ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న వారికి కాంట్రాక్ట్ ఉద్యోగ భద్రత కల్పించాలి. 5 సంత్సరాలుగా పని చేస్తున్న మా పై ప్రభుత్వం వేటు వేయాలన్న ఆలోచన విరమించుకోవాలి. మమ్మల్ని కొనసాగిస్తున్నట్లు లిఖిత పూర్వకంగా తెలియజేయాలి. లేకుంటే అక్టోబరు 1 నుంచి నిరసన తెలుపుతాం.

– అప్పలస్వామి సూపర్‌వైజర్, పార్వతీపురం

ఆ నిర్ణయం వెనక్కి తీసుకోవాలి



ఏపీ బెవరేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ ఉద్యోగులను విధుల నుంచి తొలగించాలన్న నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి. 5 సంవత్సరాలుగా పని చేస్తున్న ఉద్యోగానికి భద్రత కల్పించాలి. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు రేపటి నుంచి నిరసన తెలుపుతాం

–రామ్మోహన్, సెల్స్‌మన్, పార్వతీపురం

కుటుంబాలు రోడ్డున పడతాయి



ప్రభుత్వ నిర్ణయం వల్ల మా కుటుంబాలు రోడ్డున పడతాయి. మాలాంటి చిరుద్యోగులకు కూటమి ప్రభుత్వ భరోసా కల్పించాలి. ప్రైవేట్ దుకాణాల్లో మమ్మల్నే కొనసాగించేలా చర్యలు చేపట్టాలి. ఈ అంశంపై ప్రభుత్వం లిఖిత పూర్వకంగా సమాధానం చెప్పాలి. లేందంటే నిరసన తెలియజేస్తాం.

– సూరేష్, సెల్స్‌మన్, పార్వతీపురం

గంజాయి కేసుల్లో పట్టుబడితే జీవితాలు అస్తవ్యస్తం

- ఎస్పీ వకుల్ జిందాల్



వకుల్ జిందాల్, ఎస్పీ, విజయనగరం

విజయనగరం క్రైమ్: గంజాయి కేసుల్లో పట్టుబడితే ప్రస్తుతం అమలులో ఉన్న కఠిన చట్టాలతో జీవితాలు నాశనమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఎస్పీ వకుల్ జిందాల్ ఆదివారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ప్రస్తుతం గంజాయి అక్రమ రవాణా నియంత్రణకు కఠినచర్యలు చేపడుతూ, చట్టాలను కూడా కఠినతరం చేశారన్న విషయాన్ని యువత గుర్తించాలని పిలుపునిచ్చారు. గంజాయి కేసుల్లో ఎక్కువగా యువతే పట్టుబడుతూ, జైళ్లలో మగ్గుతున్నారన్నారు. గంజాయి కేసుల్లో న్యాయస్థానాలు కూడా వెంటనే బెయిల్ మంజూరు చేసే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. యువత చెడు వ్యసనాలు, స్నేహాలకు అలవాటు పడి, వారి అవసరాలను తీర్చుకునేందుకు అక్రమదారుల్లో ప్రయాణిస్తూ, జైలుపాలవుతున్నారని అభిప్రాయ పడ్డారు. కావున, యువత తమ చెడు అలవాట్లకు స్వస్తి పలికి, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటిని సాధించేందుకు కృషి చేయాలని హితవు పలికారు. గంజాయి వ్యాపారుల ప్రలోభాలకు లొంగవద్దని, గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగాలకు దూరంగా ఉండాలని ఎస్పీ సూచించారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య



పిల్లలతో జ్యోతి, రాము (ఫైల్)

పాచిపెంట: ప్రేమించి పెళ్లి చేసుకున్న ఆ గిరిజన జంట ముగ్గురు పిల్లలతో సంతోషంగా ఉన్నారు. అయితే మద్యం మహమ్మారి ప్రవేశించి వారి జీవితాలను ఛిన్నాభిన్నం చేసింది. అప్పుడప్పుడు మద్యాన్ని తాగే భర్త ఆ సమయంలో భార్యతో గొడవపడేవాడు. భార్యాభర్తల మధ్య గొడవలు తరచూ అవుతున్న నేపథ్యంలో భర్త తీరుపై మనస్తాపానికి గురైన ఓగిరిజన వివాహిత ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పాచిపెంట మండలంలోని పద్మాపురం గ్రామంలో జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కుంబి రాము శనివారం పూటుగా మద్యం తాగి భార్య జ్యోతితో గొడవపడ్డాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన జ్యోతి శనివారం అర్ధరాత్రి వంటింట్లో ఉరివేసుకుంది. తెలవారుజామున 3 గంటల సమయంలో భర్తకు మెలకువ వచ్చి వంటగదివైపు వెళ్తుండగా ఆత్మహత్యకు పాల్పడిన భార్యను చూసి వెంటనే స్థానికులకు తెలియజేశాడు. మృతురాలి తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నామని ఎస్సై వెంకటసురేష్ తెలిపారు. వారికి ముగ్గురు చిన్నపిల్లలు ఉన్నారు.

మితిమీరిన వేగంతో ప్రమాదం

- రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరి మృతి
- మరో ఇద్దరికి గాయాలు



ప్రమాదంలో మృతి చెందిన బిడ్డిక జుజారి



బిడ్డిక శ్రీను

గుమ్మలక్ష్మీపురం: మితిమీరిన వేగం రెండు నిండు ప్రాణాలు బలి తీసుకోగా..మరో ఇద్దరిని ఆస్పత్రి పాలు చేసింది. కురుపాం మండలంలో ఆదివారం జరిగిన ఈ సంఘటనపై నీలకంఠాపురం ఎస్సై నీలకంఠారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కురుపాం మండలంలోని ఆగంగూడ గ్రామానికి చెందిన బిడ్డిక జుజారి (45) తన భార్య ఇమరితో కలిసి ద్విచక్ర వాహనంపై దుంబిడి గ్రామంలో చర్చికి వెళ్తున్నాడు. అదే సమయంలో ఆవిరిమానుగూడ గ్రామానికి చెందిన బిడ్డిక శ్రీను(22) తన బంధువైన శ్రీధర్‌తో పాటు ద్విచక్రవాహనంతో తిత్తిరి నుంచి వస్తున్నాడు. మితిమీరిన వేగంతో ఎదురెదురుగా వస్తున్న ఈ రెండు వాహనాలు బల్లేరుగూడ జంక్షన్ వద్ద ఢీకొన్నాయి. దీంతో జుజారి, శ్రీనులు అక్కడికక్కడే మృతిచెందారు. ఆ వాహనాలపై వెనుకన కూర్చున్న జుజారి భార్య ఇమరితో పాటు శ్రీధర్‌కు గాయాలయ్యాయి. ఈ సమాచారం తెలుసుకున్న నీలకంఠాపురం ఎస్సై నీలకంఠారావు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను మొండెంఖల్లు పీహెచ్‌సీకి వైద్యం నిమిత్తం తరలించారు. ఇమరికి తీవ్రంగా గాయాలవడంతో మెరుగైన వైద్యం నిమిత్తం విజయనగరం మహారాజా ఆస్పత్రికి రిఫర్ చేశారు. శ్రీధర్ మొండెంఖల్లు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

జ్వరాల విజృంభణ

- జిల్లాలో ఇప్పటివరకు సుమారు 2.70 లక్షల కేసులు
- వైద్యసిబ్బంది సర్వేలో 19 వేలమంది జ్వర పీడితులు
- 552 మలేరియా కేసులు, డెంగీ కేసులు 142 నమోదు
- జ్వరపీడితులతో కిటకిటలాడుతున్న ఆస్పత్రులు



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఫిమేల్ వార్డులో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు

విజయనగరం ఫోర్ట్:

జిల్లాలో జ్వరాలు విజృంభిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా అధిక సంఖ్యలో కేసులు నమోదవుతున్నాయి. గిరిశిఖర ప్రాంతాల్లో వైరల్ జ్వరాలతో పాటు, మలేరియా జ్వరాలు ఎక్కువగా నమోదవుతున్నాయి. ఆస్పత్రికి వెళ్లడానికి రహదారి సౌకర్యం లేక గిరిజనులు ఇంటి వద్దే ముక్కుతూ మూలుగుతూ గడుపుతున్నారు. జ్వరపీడితులతో ప్రభుత్వ , ప్రైవేట్ ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. పీహెచ్‌సీ, సీహెచ్‌సీలకు కూడా అధికసంఖ్యలో జ్వరం, జలుబు, దగ్గు వంటి లక్షణాలతో రోగులు వస్తున్నారు. ఆస్పత్రులకు జ్వరాలతో వస్తున్న వారిలో కొతమంది ఇన్‌పేషేంట్లుగా చేరుతుండగా మరి కొంతమంది ఔట్‌పేషేంట్లుగా చికిత్స తీసుకుని ఇంటికి వెళ్తున్నారు. సాధారణ జ్వరం, జలుబు, దగ్గు ఉన్న వారు పీహెచ్‌సీలకు వెళ్తున్నారు. తీవ్రమైన జ్వరం, ఉన్న వారు ఏరియా ఆస్పత్రి, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి వెళ్తున్నారు. వైరల్ జ్వరాలతో పాటు డెంగీ, మలేరియా కేసులు కూడా ఈఏడాది ఎక్కువగానే నమోదయ్యాయి.

ప్రతి పల్లెలోను జ్వరపీడితులు :

జిల్లాలో ప్రతి పల్లెలోను ఒక్కో ఇంట్లో ఇద్దరు, ముగ్గురు జ్వరాల బారిన పడుతున్నారు . మరి కొన్ని ఇళ్లలో ఇంటిల్లిపాది జ్వరాలతో బాధ పడుతున్నారు. ప్రస్తుతం వ్యాప్తి చెందుతున్న జ్వరాలు గతంలో కంటే భిన్నంగా ఉంటున్నాయి. ఒకటి రెండు రోజులకు జ్వరం తగ్గిపోయినప్పటికీ నీరసం, దగ్గు వంటివి వారం, 10 రోజుల వరకు తగ్గడం లేదు. దీంతో జ్వరం వచ్చిందంటే చాలు ఇంటి నుంచి కదల్లేని పరిస్థితి.

అధికంగా మలేరియా, డెంగీ కేసులు

జిల్లాలో జనవరి నుంచి సెప్టెంబర్ 27 నాటికి జిల్లాలో 142 డెంగీ, 552మలేరియా కేసులు నమోదయ్యాయి. వైరల్ జ్వరాల కేసులుసుమారు 2.70 లక్షలు నమోదయ్యాయి.

కొత్త లక్షణాలతో జ్వరాలు

ప్రస్తుతం విషజ్వరాలు కొత్త లక్షణాలతో వ్యాప్తి చెందుతున్నాయి. జ్వరం, దగ్గు, జలుబు, గొంతు నొప్పి, వికారం, ఆకలి మందగించడం, కాళ్ల నొప్పులతో బాధిస్తున్నాయి.




ల్యాబొరేటరీ వద్ద వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న రోగులు

ఇంటింటి సర్వేలో 19 వేలమంది పీడితుల గుర్తింపు

సెప్టెంబర్ నెలలో వైద్య సిబ్బంది జిల్లాలో ఇంటింటి సర్వే నిర్వహించగా ఈ సర్వేలో 19 వేల మందిని జ్వరపీడితులుగా గుర్తించారు.

వైద్య పరీక్షల కోసం క్యూ కడుతున్న జనం

జ్వరాలు రోజులు తరబడి తగ్గకపోవడంతో వైద్య పరీక్షల కోసం ల్యాబొరేటరీలకు క్యూ కడుతున్నారు. ప్రభుత్వ ల్యాబొరేటరీలతో పాటు ప్రైవేట్ ల్యాబొరేటరీలను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ల్యాబొరేటరీకి రోజుకి 50 నుంచి 100 మంది వరకు జ్వర పీడితులు వస్తున్నారు. నగరంలో 50 వరకు ప్రైవేట్ ల్యాబొరేటరీలు ఉన్నాయి. వాటికి రోజుకు 1500మంది నుంచి 2500 మంది వరకు జ్వర పీడితులు వైద్య పరీక్షల కోసం వెళ్తున్నారు.



రోగులతో కిటకిటలాడుతున్న ఓపీ విభాగాలు

చర్యలు తీసుకుంటున్నాం

జ్వరాల వ్యాప్తిని అరికట్టడానికి చర్యలు తీసుకుంటున్నాం. ఇంటింటి ఫీవర్ సర్వే చేశాం. సెప్టెంబర్ మొదటి వారంలో రోజుకు 1300 వరకు కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం రోజుకు 500 నుంచి 600 వరకు కేసులు నమోదవుతున్నాయి.ప్రస్తుతం జ్వరాల వ్యాప్తి తగ్గింది.

డాక్టర్ ఎస్.భాస్కరావు, డీఎంహెచ్‌ఓ

విశాఖ ఉక్కును సమష్టిగా రక్షించుకుందాం



పోస్టర్ విడుదల చేస్తున్న జనవిజ్ఞాన వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి కృష్ణాజీ

విజయనగరం అర్బన్: భవిష్యత్తు తరాలను దృష్టిలో పెట్టుకుని పార్టీలకతీతంగా విశాఖ స్టీల్ కర్మాగారాన్ని సమష్టిగా పరిర క్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందని జన విజ్ఞాన వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎంవీఆర్.కృష్ణాజీ పిలుపునిచ్చారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం అక్టోబర్ 2 గాంధీ జయంతి రోజున విశాఖలో చేపట్టే నిరసన ర్యాలీకి జిల్లా ప్రజలంతా తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ర్యాలీని జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం నగరంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉత్తరాంధ్ర ప్రజల సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం విలేకరుల సమావేశంలో డాక్టర్ ఎంవీఆర్ కృష్ణాజీ మాట్లాడుతూ ఎంతోమంది త్యాగమూర్తుల బలి దానంతో సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమ ఉత్తరాంధ్రలో లక్షల మందికి ఉపాధి కల్పిస్తూ దేశానికి తలమానికంగా ఉందన్నారు. ఇంతటి మహోన్నతమైన స్టీల్ ప్లాంట్‌ను నిర్దాక్షిణ్యంగా మన ప్రభుత్వాలు అమ్మకానికి పెట్టడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్ర బీసీ అసోసియేషన్ ప్రెసిడెంట్ నీల తిలక్ మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థకు వేల కోట్ల రూపాయలు ఆదాయాన్ని ఇచ్చిన విశాఖ ఉక్కును అమ్మకానికి పెట్టడం ఆందోళన కలిగిస్తోందన్నారు. రాష్ట్ర నిరుద్యోగుల సంఘం ప్రెసిడెంట్ ఎస్.హేమంత్ మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థకు లాభాలు తెచ్చిపెట్టే ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అప్పగించడం దుర్మార్గమని మండపడ్డారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి గొర్లె సూరిబాబు మాట్లాడుతూ దేశంలో ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీలను లేకుండా చేయడమే లక్ష్యంగా విశాఖ స్టీల్‌ను ప్రైవేటీకరణ చేసేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు.

జిల్లా ప్రజలంతా తరలి రావాలి

ఉత్తరాంధ్ర ప్రజల సంస్థ జిల్లా కన్వీనర్ డాక్టర్ రమేష్ రాజు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని ఎలుగెత్తి చాటాల్సిన బాధ్యత మన అందరి పైన ఉందని, విశాఖ ఉక్కు రక్షణ కోసం గాంధీ జయంతి రోజు విశాఖ డాబా గార్డెన్స్‌లోని అంబేడ్కర్ విగ్రహం నుంచి చేపట్టే నిరసన ర్యాలీ కార్యక్రమంలో జిల్లా నుంచి ప్రజలంతా అధిక సంఖ్యలో తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో విశ్వ మానవ సమాజం ప్రధాన కార్యదర్శి ఎం.డి నయీమ్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) సభ్యులు, న్యాయవాది గేదెల సత్యం, సీనియర్ న్యాయవాది గుండుపల్లి సతీష్, గొంప ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయం

- జ్యుడిషియల్ కస్టడీకి నిందితుడి తరలింపు



మెంటాడ: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

మెంటాడ: మండలంలోని చింతలవలసలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. దీనిపై ఎస్సై కె.సీతారాం తెలిపిన వివరాల ప్రకారం..గ్రామంలో ఓ వ్యక్తి మద్యం అమ్ముతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేసి 20 మద్యం సీసాలతో నిందితుడిని పట్టుకున్నారు. అనంతరం మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసి జ్యుడిషియల్ కస్టడీకి తరలించారు. గ్రామాల్లో ఎవరైనా అక్రమంగా మద్యం అమ్మితే కఠిన చర్యలు ఉంటాయని ఎస్సై ఈ సందర్భంగా హెచ్చరించారు.

21 మద్యం సీసాలు స్వాధీనం

గుర్ల: మండల కేంద్రంలో అక్రమంగా బెల్ట్ షాపు నిర్వహిస్తూ మద్యం అమ్మకాలు చేస్తున్న మహిళను గుర్ల పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. ఆమె నుంచి 21 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.నారాయణరావు తెలిపారు. అక్రమంగా బెల్ట్ షాపుల ద్వారా మద్యం అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని మద్యం అమ్మకాలు జరుపుతున్న వారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

ఆకట్టుకుంటున్న భగత్‌సింగ్ స్టూడెంట్ ఫెస్ట్

రెండవ రోజు కొనసాగిన నాటక, నృత్య పోటీలు



విద్యార్థినుల నృత్యప్రదర్శనలు

విజయనగరం పూల్‌బాగ్: భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురజాడ కళాభారతిలో జరుగుతున్న భగత్ సింగ్ స్టూడెంట్ ఫెస్ట్ రెండో రోజుకు చేరుకుంది. రెండవ రోజు మొదటిగా మెగా సైన్స్ డెమో నిర్వహించారు. ఇందులో భాగంగా 50 రకాల విజ్ఞాన ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. అనంతరం నిర్వహించిన మెగా మ్యాజిక్ షోలో ప్రముఖ మెజీషియన్ చంద్రయ్య చేసిన అనేక రకాల మ్యాజిక్ అంశాలు విద్యార్థులను ఆకట్టుకున్నాయి. మ్యాజిక్ షోలో ఆయన మాట్లాడుతూ ఈ ప్రపంచంలో ఏది జరిగినా దానికి ముఖ్య కారణం సైన్స్ మాత్రమే అని, మనం చేసే ప్రతి గారడీ వెనుక ఏదో ఒక సైన్స్ ఉంటుందని దానిని విద్యార్థులు అందరూ గ్రహించాలని కోరారు. అనంతరం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి రామ్మోహన్ రావు మాట్లాడుతూ రెండవ రోజు కూడా వేలాదిగా విద్యార్థులు విచ్చేసి భగత్ సింగ్ స్టూడెంట్ ఫెస్ట్‌ను జయప్రదం చేయడం ఆనందకరమైన విషయమన్నారు. ఈ ప్రదర్శనలు మూడవ రోజు కూడా కొనసాగుతాయని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వచ్చి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ వెంకటేష్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 300 మంది వలంటీర్లు ఈ భగత్ సింగ్ స్టూడెంట్ ఫెస్ట్ జయప్రదానికి విచ్చేసి సేవలందిస్తున్నారని అదేవిధంగా విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రజానీకం ప్రతిరోజు విచ్చేసి జయప్రదం చేస్తున్నారని సంతోషం వెలిబుచ్చారు. అనంతరం పలు కళాశాల నుంచి వచ్చిన విద్యార్థులు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాములోరికి వైభవంగా 'పవిత్ర సమర్పణ'

- శ్రీరంగం నుంచి తెచ్చిన పట్టు పవిత్రాలతో ఊరేగింపు
- సంప్రదాయబద్ధంగా అష్ట కలశ ఆరాధన
- యాగశాలలో నేడు పూర్ణాహుతి ఘట్టం



పట్టు పవిత్రాలను ఊరేగిస్తున్న వేద రుత్విక్కులు, అర్చకస్వాములు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో రామస్వామి పవిత్రోత్సవాల్లో భాగంగా ఆలయ అర్చకులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున స్వామికి ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత ఉత్సవమూర్తుల వద్ద విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, అష్టకలశ ఆరాధన, తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపించారు. శ్రీరామచంద్ర స్వామికి వివిధ నదీ జలాలతో పంచామృతాభిషేకాలను నిర్వహించారు. అనంతరం యాగశాలలో ప్రాయశ్చిత్త హోమాలు చేపట్టి శ్రీరంగం నుంచి తీసుకొచ్చిన పట్టుదారాలతో తయారైన పవిత్రాలతో ప్రదక్షిణలు చేశారు. పట్టు పవిత్రాలను గర్భాలయంలోకి తీసుకువచ్చి శ్రీరామచంద్రస్వామి ధృవమూర్తులకు అలంకరించారు. తరువాత స్వామికి మహానివేదన, మంగళశాసనం కార్యక్రమాలను వైదిక సిబ్బంది జరిపించారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన వేద రుత్విక్కులు స్వామి సన్నిధిలో పారాయణాలు, యాగశాలలో హోమాలు నిర్వహించారు. సోమవారం పారాయణాలు, జపములు, హవములు పూర్తి చేసి పవిత్ర విసర్జన, యాగశాలలో పూర్ణాహుతి జరిపిస్తామని అర్చకస్వాములు తెలిపారు.